క్లుప్తంగా

8 వరకు పింఛన్ల పంపిణీ

నల్లగొండ : ఆసరా పింఛన్లను ఈ నెల 8వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు ఆయా పోస్టాఫీసుల్లో పింఛను మొత్తం నేరుగా పొందాలని పేర్కొన్నారు. పింఛను మొత్తంతో పాటు రూ.16 చిల్లర సహా అడిగి తీసుకోవాలని సూచించారు.

పరీక్ష సామగ్రి అందజేత

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో టెన్త్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ సెక్రటరీ రేగులగడ్డ నర్సింహగౌడ్ సహకారంతో ఏర్పాటు చేసిన పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీని శనివారం ఆ పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఎంఈఓ పానుగోతు సైదానాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆ క్లబ్ కోశాధికారి కొల్లోజు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, జాయింట్ సెక్రటరీ కరుణాకర్‌గౌడ్, సైదులుగౌడ్ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

కనగల్: కనగల్ మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన నేలంటి కోటయ్య జ్ఞాపకార్థం హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 200మందికి కంటి పరీక్షలు చేశారు. 40మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉండగా వారిని హైదరాబాద్‌కు తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో కోటయ్య కుమారుడు నేలంటి రవి సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య, కొరివి శంకర్, నకిరేకంటి వెంకన్న, పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

మునుగోడు: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. శనివారం మునుగోడులో నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ప్రతి నెలా రూ. 6వేల పెన్షన్ అందించడంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు తలారి సహదేవులు, వంటిపాక ముత్తమ్మ, ఆకారపు వెంకన్న, రవి, పరమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వివాహ కానుకలు అందజేత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ఇటీవల వివాహమైన యువతులకు ఆ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఏర్పాటు చేసిన పెళ్లి కానుకలను శనివారం ఆ గ్రామ బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన వేముల నీలమ్మ, పాలకూరి నీలమ్మలకు ఒక్కొక్కరికి రూ.50వేలు, కమ్మంపల్లి సునీతకు రూ.30వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుంకరి యాదగిరిగౌడ్, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఉయ్యాల నాగరాజుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఎంజీయూ విద్యార్థులకు యునైటెడ్ స్కాలర్‌షిప్

నల్లగొండ టూటౌన్: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల సీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అనిల్ చౌహాన్, ఆకాష్‌లు యునైటెడ్ హైదరాబాద్ సాహస స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈమేరకు ఆకాష్ స్కాలర్‌షిప్ ద్వారా పరిశోధనకు అవసరమైన కంప్యూటర్‌ను కొనుగోలు చేసి వీసీ అల్తాఫ్ హుస్సేన్ చేతుల మీదుగా శనివారం అందుకున్నాడు.

రేషన్ బియ్యం పట్టివేత

చండూరు: రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ తిరిగి కొనుగోలు చేసి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. చండూరు మండలంలోని కొండాపురం గ్రామంలో రేషన్ కార్డుదారుల నుంచి వాంకుడోత్ శ్రీధర్ ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి డీసీఎం ద్వారా ఇతర ప్రాంతానికి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

అలా హామీ ఇచ్చి.. ఇలా అమలు చేసి..

- తమ గ్రామాల చెరువులను ఉదయ సముద్రం నీటితో నింపాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని వేడుకున్న రైతులు
- వెంటనే స్పందించి నీరు పారించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం
- సొంత ఖర్చులతో వారం రోజుల్లోనే ప్రత్యేక కాల్వ తవ్వించిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యే ప్రత్యేకంగా తవ్వించిన కాల్వ ద్వారా పులిపలుపుల చెరువు వైపు పారుతున్న నీరు

మునుగోడు: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వారం రోజుల క్రితం రైతులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయించారు. దీంతో ఆ గ్రామాల రైతుల్లో పట్టరాని ఆనందం నెలకొంది. గత ఆదివారం మునుగోడుకు వచ్చిన ఎమ్మెల్యేకు గంగోరిగూడెం, పులిపలుపుల, రత్తిపల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ గ్రామాల్లోని చెరువులకు బి.వెల్లెంల ఉదయసముద్రం నీరు మళ్లించాలని కోరారు. స్పందించిన ఆయన మరుసటి రోజు సంబంధిత అధికారులకు నీరు పారించేందుకు అనువైన స్థలం పరిశీలించాలని ఆదేశించారు.

సొంత డబ్బులతో యంత్రాలు ఏర్పాటు చేసి..

బి.వెల్లెంల ఉదయసముద్రం నుంచి నేరడ గ్రామానికి నీరు పారుతున్న కాల్వ నుంచి అదే గ్రామ సమీపంలోని ఓ కుంటకు ప్రత్యేక కాల్వ తవ్వించేందుకు అవసరమైన యంత్రాలను ఎమ్మెల్యే తన సొంత డబ్బులతో ఏర్పాటు చేయించారు. దాదాపు కిలో మీటరుకు పైగా కాల్వ తవ్వించాడు. దీంతో ఆ కాల్వ ద్వారా ప్రస్తుతం నేరడ కుంటలోకి నీరు పారుతోంది. కుంట నిండి అలుగుపోస్తే రత్తిపల్లి గ్రామ సమీపం నుంచి పల్లికాల్వ ద్వారా నేరుగా పులిపలుపుల గ్రామ పెద్ద చెరువులోకి వచ్చి చేరుతాయి. 350 ఎకరాల్లో ఉన్న ఈ చెరువు నిండితే దాదాపు ఐదు, ఆరు గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడంతోపాటు గ్రామాల్లో నెలకొన్న మంచి నీటి సమస్యలు పూర్తిగా పరిష్కారం కానున్నాయి. సొంత ఖర్చుతో ప్రత్యేకంగా కాల్వ తవ్వించిన ఎమ్మెల్యేకు తాము రుణపడి ఉంటామని రైతులు పేర్కొంటున్నారు.

అడిగిన వెంటనే పూర్తిచేయించారు



మా గ్రామంలోని చెరువులోకి ఉదయసముద్రం నీరు పారించాలని గత ఆదివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలసి కోరాం. మరుసటి రోజే అధికారులను పంపించి కాల్వ తవ్వించాలని సూచించారు. అందుకు అవసరమైన ఖర్చులు కూడా ఎమ్మెల్యే భరించి గత మూడు రోజుల క్రితం పనులు ప్రారంభించి పూర్తిచేయించారు.

– గోపగోని పాపయ్య, గంగోరిగూడెం

ఎమ్మెల్యే మేలు ఎప్పటికీ మరిచిపోలేం



మా గ్రామ చెరువును ఉదయసముద్రం నీటితో నింపాలని కోరిన వెంటనే కేవలం వారం రోజుల్లో పనులు పూర్తి చేయించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మేలు ఎప్పటికీ మరిచిపోము. గత నాలుగు, ఐదేళ్లుగా చెరువులో నీరు లేక భూగర్భ జలాలు పడిపోయాయి. చెరువులోకి వచ్చే ఉదయసముద్రం నీటితో ఆ సమస్య పూర్తిగా తీరుతుంది.

– దోటి నారాయణ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కేక్ కట్ చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

కట్టంగూర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మథర్ థెరిస్సా గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పొలిశెట్టి జూలియన్ అన్నారు. శనివారం కట్టంగూర్ మండలంలోని పామనగుండ్ల గ్రామ రైతు వేదికలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్‌పల్లి, పామనగుండ్ల, ముత్యాలమ్మగూడెం, దుగినవెల్లి, ఎరసానిగూడెం గ్రామాల మహిళా సంఘాల సభ్యులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పామనగుండ్ల పంచాయతీ కార్యదర్శి జయసుధ, నాగమణి, నవ్య, లుర్థురాజ్, కుశలవరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ టూటౌన్: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిగూడ గ్రామానికి చెందిన దొండ శ్రీకాంత్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులకు మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి శనివారం రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ రూ.5వేలు, మాజీ కౌన్సిలర్ గున్‌రెడ్డి యుగంధర్‌రెడ్డి రూ. 5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అదే విధంగా 19వ వార్డుకు చెందిన అన్నమల్ల రఘురామ్ వర్మ ఇటీవల మృతిచెందగా.. కుటుంబసభ్యులకు మందడి సైదిరెడ్డి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నకిరేకల్: మండలంలోని మంగళపల్లి గ్రామానికి కట్ట లింగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం బాధిత కుటుంబానికి బీజీఆర్ ఫౌండేషన్ ప్రతినిధి బచ్చుపల్లి రామలింగారావు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, చింతల శ్రీను, కట్ట ధనరాజ్, బచ్చుపల్లి మునీందర్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి రూ.10వేలు ఆర్థికసాయం

కట్టంగూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మేడి సురేష్ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ శనివారం ఆయనను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, గుండాల మల్లేష్, మేకల రమేష్, మేడి ఇద్దయ్య, మేకల చిన ఇద్దయ్య, యాదయ్య, వెంకన్న, చంద్రయ్య, కృష్ణయ్య ఉన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని తొండ్లాయి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు దంతూరి శంకర్ ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైన పాముకాటుకు గురై మృతి చెందాడు. స్పందించిన కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ వారు రూ.20 వేల ఆర్థికసాయాన్ని పంపించారు. అసోసియేషన్ నాయకులు ఈ సాయాన్ని శంకర్ భార్య మౌనికకు అందజేశారు. కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న, ముద్దం స్వామి, పల్లె స్వామి, పల్లే చంద్రమౌళి, సత్యనారాయణ, కృష్ణమూర్తి, గీత కార్మికుడు చంద్రయ్య, యాదయ్య తదితరులున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయురాలు రెజీనా దంపతులను సన్మానిస్తున్న నాయకులు

మునుగోడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న స్టెల్లా రెజీనా ఉద్యోగ విరమణ పొందారు. ఈమేరకు శనివారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించి ఆమెను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యూసుఫ్‌పాషా, ప్రధాన కార్యదర్శి అనపురెడ్డి అనుపూర్‌రెడ్డి, కళావతి, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, అంజయ్య, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చదువుకుంటే ఏదైనా సాధించవచ్చు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


తిప్పర్తిలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్

నల్లగొండ: మహిళలు చదువుకుంటే ఏదైనా సాధించవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఇంటి పనులు చేస్తూ టైలరింగ్ నేర్చుకోవడం గొప్ప విషయమన్నారు. చదువుకు వయసుతో సంబంధం లేదని, పెద్దపెద్ద కంపెనీలు నిర్వహించేవారు సైతం 50 సంవత్సరాల తర్వాత చదువుకుని కంపెనీలను ప్రారంభించారని తెలిపారు. ఇలా చదివిన చాలా మంది సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని పైకి ఎదగాలన్నారు. పుస్తకాలను బాగా చదవాలని, తాను కూడా తెలంగాణ ఉద్యమంపై అవగాహన కోసం అనేక పుస్తకాలు చదివానని కలెక్టర్ తెలిపారు. దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలు కుట్టు మిషన్లు నేర్చుకునేందుకు గాను మిషన్లు లేవని కలెక్టర్‌కు చెప్పగా 30 మందికి కుట్టు మిషన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి తదితరులున్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

తిప్పర్తి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్టోర్‌రూం, కిచెన్ రూంలను పరిశీలించారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రాజారాజేశ్వరి అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



ముత్యాలమ్మగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు

కట్టంగూర్: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. ఫీల్డ్ ట్రిప్ ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎంపీపీఎస్ నోముల, ఎంపీపీఎస్ నెల్లిబండ పాఠశాల విద్యార్థులు శనివారం కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం, కట్టంగూర్ గ్రామంలో విద్యా విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్ఫేస్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్, డెయిరీ ఫామ్స్, సోలార్ కోల్డ్ స్టోరేజ్, ఎలక్ట్రికల్ రీచార్జ్ యూనిట్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సంధ్యాల హరీందర్, సులోచన, జన విజ్ఞాన జిల్లా కార్యదర్శులు గంగాధరి భద్రయ్య, కోకిల, వంటిపాక నాగేష్, నాగరాజు ఉన్నారు.

కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

నల్లగొండ టౌన్: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు నేడు సమస్యలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందన్నారు. మహాసభలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్ రెడ్డి, డివిజన్ కార్యదర్శి లెనిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు గుండె రవి, కార్యదర్శి రెవెల్లి యాదయ్య, కోశాధికారి నర్సింహ, నాయకులు యాదయ్య, నరేందర్, లింగయ్య, రాములు, వెంకన్న, మల్లేష్, హరికృష్ణ, లవకుశ, యాదయ్య, చిరంజీవి, గోవింద్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, అంజయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కనగల్: మండల కేంద్రంలో గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న శ్రీ పార్వతి బండి రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిసాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలను కోలాట బృందాలు, భజనల నడుమ గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ నర్సింగ్ సునితాకృష్ణయ్యగౌడ్, అర్చకుడు పి శంకర్‌శర్మ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నల్లగొండ టౌన్: స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అయినప్పటికీ దళితుల అభ్యున్నతికి రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికీ అమలు కావడం లేదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఆరోపించారు. శనివారం నల్లగొండలోని మగ్దూం భవన్‌లో డీహెచ్‌పీఎస్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి పోరాడుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలన్న లక్ష్యంతో ఉద్యమిస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం దళితులు చేస్తున్న పోరాటంలో డీహెచ్‌పీఎస్ భాగస్వాములు కావాలన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం మార్చేందుకు ప్రయత్నిస్తోందని, దానిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమాజంలో జరుగుతున్న కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలన్నారు. సమావేశంలో గోసుకొండ లింగయ్య, బొల్లురి నర్సింహ, ఊరిపక్క వెంకటయ్య, జిల్లా సత్యం, వల్లపట్ల వెంకన్న, జంగిలి కొండల్, లింగయ్య, జిల్లా యాదగిరి, నడిపాక అశోక్, వీరస్వామి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నల్లగొండ: నల్లగొండ డివిజన్ పరిధిలోని తాగునీటి సరఫరాపై ఆర్డీఓ అశోక్ రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆయా మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. మండలాల వారీగా గ్రామాల్లో తాగునీటి పరిస్థితిపై సూచనలు చేశారు. సమావేశంలో ఈఈ నరసింహ పాల్గొన్నారు.

కల్వకుంట్లకు ఆర్టీసీ బస్సు నడపాలని వినతి

మునుగోడు: విద్యార్థులకు పరీక్షల సమయంలో మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి ఆర్టీసీ బస్సు బస్సు నడిపించాలని కోరుతూ డీవైఎఫ్ఐ నాయకులు శనివారం నల్లగొండ ఆర్‌ఎంకు వినతి పత్రం అందజేశారు. కనీసం పరీక్షల సమయంలోనైనా బస్సు నడిపితే సకాలంలో విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కట్ట లింగస్వామి, వరికుప్పల ముత్యాలు, నాయకులు పగిళ్ల యాదయ్య, పరమేష్ ఉన్నారు.

స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు గిరి

నల్లగొండ: స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ వసతి గృహంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంజమూరి రాఘవాచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వర్ణకార సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ రికవరీల పేరిట పోలీసుల వేధింపుల సమస్యను మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. బుర్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సంఘ సభ్యులందరూ ఐక్యతగా ఉంటే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనుగుర్తి గోపి, కోశాధికారి కటకం రమేష్ చారితోపాటు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, పాశం రామ్‌రెడ్డి, జూకూరి రమేష్, కందుకూరి పూర్ణాచారి, కన్నెకంటి సత్యం, అన్నభీమోజు నాగార్జున చారి, కొల్లూరు సత్యనారాయణ చారి, కూరెళ్ల మధనాచారి, గొట్టుముక్కల చంద్రశేఖర్, రాగిఫణి విష్ణుమూర్తి, సొల్లేటి కృష్ణ, కంచనపల్లి చంద్రశేఖర్, మోర భీష్మాచారి, సిరిగద్దే విఠలాచారి పాల్గొన్నారు.

అమరులకు నివాళి


శాలిగౌరారంలో అమరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిట్యాల: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారికి శనివారం చిట్యాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎరసాని గోపాల్ మాట్లాడుతూ.. అమరుల ఆశయ సాధనకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు నోముల పురుషోత్తం, ఎమ్మార్పీఎస్ నాయకులు జిట్ట రవి, ఏర్పుల సైదులు, మేడి కృష్ణ, కావలి కృష్ణ, వడ్డెపల్లి భిక్షం, జోగు ప్రవీణ్, వలిగొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్): ఎస్సీ వర్గీకరణ అమరులకు శనివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ నాయకులు నివాళులర్పించారు. మండల కన్వీనర్ తలారి సాయిలు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకులు బరిగల లింగయ్య, గౌరవ అధ్యక్షుడు బరిగల లక్ష్మయ్య, భీమనపల్లి శంకర్, ఖమ్మం శ్రీనివాస్, గణేష్, ఎర్ర వెంకటేష్, నవీన్, భీమనపల్లి ప్రవీణ్, గోసుకొండ అంజయ్య పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్, ప్రతినిధులు అంబేద్కర్, సైదులు, శ్రీను, వెంకటయ్య, అరవింద్, నాగరాజు, లక్ష్మణ్, రమేశ్, వెంకన్న, ప్రతాప్, అజయ్, భిక్షం పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర చట్టం చేయాలి


రైతు సభ్యత్వ నమోదులో పాల్గొన్న ముదిరెడ్డి

తిప్పర్తి: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర నిర్ణయించేలా చట్టం తేవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తిప్పర్తి మండలంలోని దుప్పలపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మూడు నల్లచట్టాలను తిరిగి మరోరూపంలో అమలు చేసేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో పంటల బీమాను అమలు చేయాలని, కౌలు రైతులను గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దొంగరి వెంకన్న, గణేష్, సైదులు, శ్రీను, యాదయ్య, భిక్షమయ్య, అండాలు, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన రాజీలేని పోరాటం

చిట్యాల: రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాలపై నిరంతరం రాజీలేని పోరాటాలను కొనసాగిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి అన్నారు. శనివారం చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల పక్షాన పనిచేస్తున్న తెలంగాణ రైతు సంఘంలో రైతులు సభ్యులుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు అర్రూరి శ్రీను, మండల నాయకులు నెల్లికంటి నర్సింహ, పంది నరేష్, అర్రూరి శంభయ్య, మోహన్‌రెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు.

• స్వపరిపాలన దినోత్సవం


కనగల్: రేగట్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


నకిరేకల్: మాస్టర్ మైండ్ పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


కేతేపల్లి: గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



మర్రిగూడ: ఖుదాబాక్షపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..


చిట్యాల: ఉరుమడ్లలోని ప్రగతి విద్యానికేతన్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు.



నార్కట్‌పల్లి: పీవీఆర్ శ్రీచైతన్య హైస్కూల్‌లో స్వపరిపాలన వేడుకలు